వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 18 జూలై 2024

## శ్రీవీరభద్ర స్వామి వారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

రాయచోటి, జులై 17, ప్రభాతవార్త:

శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి ఆలయ సంప్రదాయక ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వార్ల తతీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.



## అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీగా విద్యాసాగర్ నాయుడు

రాయచోటి, జులై 17, ప్రభాతవార్త:



ఎర్రచందనం అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీగా వారు బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ కార్యాలయంలో సతీసమేతంగా పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టు తనిఖీలతో పాటు కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

### కేంద్ర మంత్రికి రాష్ట్రమంత్రి మండిపల్లి విన్నపం

మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖా మంత్రి నితిన్‌గడ్గరికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లె రామప్రసాద్‌రెడ్డి విన్నవించారు. బుధవారం కేంద్ర మంత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లె పర్యటనకు విచ్చేశారు. ఇందులో భాగంగా కేంద్రమంత్రికి స్వాగతం పలికి రోడ్ల అభివృద్ధికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. రాజంపేట-రాయచోటి-కదిరి రహదారి-రాష్ట్ర రహదారినుంచి జాతీయ రహదారి వరకు 135కిలోమీటర్లు అప్‌గ్రేడషన్ చేయాలని విన్నవించారు. అదే విధంగా రాజంపేట-రాయచోటి-కదిరి రాష్ట్ర హైవే ఈ రహదారి మూడు జాతీయ రహదారులతో అనుసంధానం అవుతోందని, రాజంపేట వద్ద ఎన్‌హెచ్ 716 (రేణిగుంట-కడపరోడ్డు) రాయచోటి వద్ద ఎన్‌హెచ్ 40 (కర్నూల్-చిత్తూరు-రాణిపేటరోడ్డు), కదిరి వద్ద ఎన్‌హెచ్ 42(ఉరవకొండ-అనంతపురం-కదిరి-మదనపల్లె-క్రిష్ణగిరిరోడ్డు), ఎన్‌హెచ్ 40కి సంబంధించి కడప-రాయచోటిరోడ్డు రెండు లైన్లు చదును చేయబడిన వైపు నుండి నాలుగు లైన్ల వరకు విస్తరించడం చేయాలన్నారు. సిఆర్‌ఎఫ్ పథకం కింద 72,180కిలోమీటర్లు ఆరు రోడ్లు విస్తరణ రూ.109.70కోట్లు మంజూరు చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో మౌళిక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర మంత్రిని విన్నవించారు. మంత్రితో పాటు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె నియోజకవర్గలోని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్లు మరమ్మత్తు పనులు చేపట్టక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి, రాష్ట్ర తెలుగుయువత శ్రీరామ్‌చినబాబు పాల్గొన్నారు.



## కడప జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు

కడప క్రైం, జులై 17, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి ఒక్కో విభాగం పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనా విభాగం, ఆర్మరీ వర్క్‌షాప్, కమ్యూనికేషన్స్ విభాగం, కోర్టు మానిటరింగ్ సెల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకట రాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్, ఏవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎడారిలో కష్టాలు పడ్డ శివకు విముక్తి

పీలేరు, జూలై 17 ప్రభాతవార్తః



గత వారం రోజులుగా తెలుగురాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి శివ గత ఏడాది క్రితం భార్య పిల్లలను పోషించుకోవాలని భావించి అధిక వడ్డీలకు అప్పుచేసి జీవనోపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన విషయం విధితమే. అయితే నమ్మిన ఏజెంటే నట్టేట ముంచి శివకు మాయమాటలు చెప్పడమే కాకుండా మోసగించి ఇరాన్ సరిహద్దులలో మేకల కాపరిగా ఏడారిలో ఉద్యోగం వేయించాడు. అయితే కుటుంబ పోషణ కోసం గత కొన్ని నెలలుగా అష్టకష్టాలు పడి ఉద్యోగం చేస్తున్నా అక్కడి కువైట్ యజమాని శివను మరింత దుర్భర జీవితంలోకి నెట్టివేయడంతో ఆకలికి అలమటిస్తూ నిరుపేదను ఆదుకోవాలని తమ కష్టాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషియల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇది చూసిన, విన్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు స్పందించి ఇండియా ఎంబసీతో మాట్లాడి శివను ఇండియాకు రప్పించి ప్రాణాలను కాపాడారు. కుటుంబ స్థితి గతులను తెలుసుకుని గల్ఫ్ దేశాలలో ఉన్న ఎన్ఆర్ఐ తెలుగుదేశం అనుబంధ సంఘాల నాయకులతో చర్చించి ఎట్టికేలకు శివకు విముక్తి కల్పించారు. వివిద పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయంతో పాటు సరుకులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. జనసేన పార్టీ బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించింది. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, నవీన్, చిరంజీవి బాధిత కుటుంబానికి అండగా నిలిచి భరోసా కల్పించారు.

### మన ప్రభుత్వం వచ్చింది

## ప్రజాసమస్యలు పరిష్కరించుకొందాం

నిమ్మనపల్లె, జులై 17 ప్రభాతవార్త :



మన ప్రభుత్వం వచ్చింది ప్రజాసమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవతో పరిష్కరించుకొందామని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారంఆయన మదనపల్లె నుంచి సోమల మండలానికి వెలుతూ మార్గమద్యంలోనే నిమ్మనపల్లె బస్టాండు ప్రాంతంలో ఆయన కాన్వాయ్ దిగి తెలుగుదేశం నాయకులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఇందులో భాగంగానే ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎన్‌టిఆర్ అన్నా క్యాంటిన్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వీరి వెంట తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, పుంగనూరు టిడిపి ఇన్‌చార్జ్ చల్లాబాబు కలరు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రమణ, మాజీ ఎంపిపిలు రామక్రిష్ణ, పారిజాత మల్లికార్జున, మాజీ జడ్పిటిసి, వసంత మునిరత్నం, వెంకటక్రిష్ణ, నాయకులు నరేంద్ర, మండల అధ్యక్షులు సుధాకర్, మైనార్టీ నాయకులు ఖాసీం, ఇమామ్‌సాబ్, విజయ్, చినబాబు, చిన్నా, గంగాధర్, పుంగనూరు రెడ్డప్ప, సోము, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో వివిధ రకాల నల్లమందు పేల్చుతూ మంత్రికి స్వాగతం పలికారు.

## కేంద్ర మంత్రి గడ్గరికి ఘన స్వాగతం

### హెలిప్యాడ్ వద్ద మంత్రి, ఎమ్మెల్యేలు సన్మానం



మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :

కేంద్ర రోడ్డు రవాణాశాఖామంత్రి నితిన్‌గడ్గరికి మదనపల్లెలో ఘన స్వాగతం లభించింది. బుధవారం పట్టణంలోని చిప్పిలి హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జేసి ఫర్మదఅహమ్మద్‌ఖాన్‌లు కేంద్ర మంత్రికి పుష్పగుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు సన్మానించారు. వీరితో పాటు రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఎల్లంపల్లి ప్రశాంత్, టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి హెలిప్యాడ్ నుండి సత్సంగ్ ఆశ్రమానికి వెళ్ళారు. ఆశ్రమం వద్ద నిర్వాహకులు పద్మశ్రీ అవార్డు గ్రహిత శ్రీఎం.ముంతాజ్‌అలీ మంత్రికి స్వాగతం పలికారు.

## సౌత్‌జోన్ హాకీ కప్‌కైవసం చేసుకున్న ఆంధ్ర మహిళల జట్టు

పులివెందుల, జూలై 17, ప్రభాతవార్త ః



పులివెందుల పట్టణంలోని ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో జరుగుతున్న రెండవ జాతీయ సౌత్‌జోన్ హాకీ జూనియర్ ఛాంపియన్ షిప్ చివరిరోజు మ్యాచ్‌లు అన్నీ నువ్వా.. నేనా అంటూరసవత్తరంగా సాగాయి. టోర్నమెంట్ ఆరంభం నుండి ఆధిపత్యంచెలాయిస్తూ వచ్చిన ఆంధ్ర మహిళల జట్టు ఫైనల్ మ్యాచ్‌లో కూడా తన హవా కొనసాగించింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లలో మహిళా విభాగంలో ఆంధ్రప్రదేశ్ మహిళాజట్టు, కర్ణాటకజట్టుపై 5-0గోల్స్ తేడాతో విజయం సాధించి సౌత్‌జోన్ హాకీ జూనియర్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో కర్ణాటక జట్టు సౌత్‌జోన్ ఛాంపియన్ ట్రోఫీని సాధించింది. ఆంధ్ర, వైఎస్ఆర్ కడప జిల్లా హాకీ అసోసియేషన్‌లు ఘనంగా ముగింపు కార్యక్మమాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హాకీ అకాడమీ సభ్యులు, ఆయా జట్ల మేనేజర్లు, కోచ్‌లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలేశుని ఆశీర్వాదం చురుమామిళ్లకు సువర్ణ అవకాశం : టిటిడి జెఈఓగా వెంకయ్య చౌదరి

రాజంపేట, జులై17, ప్రభాతరవార్త :



భక్తి ముక్తి కలిగిన వారికి ఎల్లవేళలా ఎక్కడున్నా దైవకృప ఉంటాదన్నాది జగమెరిగన సత్యం. నిత్యం తిరుమలేశుని తలుచుకొని కల్లు తెరిచి అడుగు పెట్టే ఒక మంచి అధికారి అయిన చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి తిరుమల వెంకటేశ్వరుని కృప లభించింది. తిరుమల దేవస్థానం నూతన జెఈఓగా వెంకయ్య చౌదరికి అవకాశం దక్కింది. ఈయన 2005 బ్యాచ్‌కి చెందిన ఐఆర్‌యస్ అధికారి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఈయనను కేంద్రప్రభుత్వం డిప్యూటేషన్ పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఈయనను ప్రపంచంలోనే పేరు గాంచిన ఏపీయండీసీ సంస్థకు ఎండీగా నియమించడం జరిగింది. ఆయన వచ్చేనాటికి అత్యంత నష్టాల బాటలో నడుస్తున్న సంస్థను 2019 నాటికి అత్యధిక లాభాలు గడించి ప్రపంచ దేశాల్లోనే ఏపీయండీసీ సంస్థకు వన్నె తెచ్చేవిధంగా అభివృద్ధి చేశారు. 2019లో ఈమనను పొరుగు రాష్ట్రమైన తెలంగాణాకు జియస్‌టీ కమీషనర్‌గా పని చేశారు. ఈయన సేవలు గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేసేందుకు డిప్యూటేషన్‌పై పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈయనకు టిటిడి బాధ్యతలు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈయన 3 సంవత్సరాల పాటు జెఈఓ పదవిలో కొనసాగనున్నట్లు కూడా తెలిసింది.

## అక్రమ గుడిసెలపై నిప్పటించిన స్థానికులు

- స్థానికులు, స్థానికేతరుల మధ్యయుద్ధం - ఇరువురికి గాయాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు -పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించిన ప్రజలు



ఇరువురిని చెదరగొడుతున్న పోలీసులు

బద్వేలు , జూలై 17 ప్రభాతవార్త :

గోపవరం మండలం, సిద్దమ్మ పేరంటాల వద్ద సర్వేనెంబరు 1623,1624లో అక్రమంగా కొంతమంది గుడిసెలు వేయడంతో స్థానికులు వారిపై దౌర్జన్యం చేశారు. గ్రేటర్ రాయలసీమ సంఘం ఆధ్వర్యంలో పది రోజుల క్రితం పేదలంతా కలిసి తిప్పపైన గుడిసెలు వేశారు. అయితే ఇది జీర్ణించుకోలేని స్థానికులు బుధవారం ఉదయం గుడిసెలు వేసుకున్న వారిపై కట్టెలతో దాడిచేశారు. దాదాపు గంటసేపు స్థానికులు, స్థానికేతరుల మధ్య ముష్టియుద్ధం జరిగింది. పథకం ప్రకారం స్థానికులు కర్రలు తీసుకుని గుడిసెలు వేసుకున్న వారిపై ఒక్కసారిగా దౌర్జన్యం చేయడంతో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో స్థానికేతరులకు తలలు పగిలాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువురిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అప్పటికే గొడవ పెద్దదై కర్రలు మరియు రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేశాక స్థానికేతరులను పోలీసుస్టేషన్‌కు తరలించి స్థానికులను అక్కడినుంచి తరిమి కొట్టారు. గాయాలైన స్థానికేతరులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసుస్టేషన్ వద్ద మహిళలు బైఠాయించి నిరసన తెలిపారు. అనవసరంగా నాపై శ్రీనివాసపురానికి చెందిన కొంతమంది దాడిచేశారని కులం పేరుతో ధూషించి మమ్మల్ని కొట్టారని మాకు న్యాయం జరిగేంతవరకు స్టేషన్‌ను వదిలిపోమని బైఠాయించారు. ఈ సంఘటన మధ్యలోనే పోలీసులు జేసీబీ సహాయంతో గుడిసెలన్ని తొలగించి నేలమట్టం చేశారు. దాదాపు మధ్యాహ్నం వరకు పోలీసులు అక్కడే ఉండి ఎలాంటి గొడవలు జరగకుండా వేసిన గుడిసెలన్ని తీసేశారు. జనసేన, టీడీపీ నాయకులు రంగప్రవేశం చేసి స్థానికేతరులకు మద్దతు తెలిపారు. అనవసరంగా దాడిచేసి ఎందుకు కొట్టారని,వారికి ఏమైనా హక్కు ఉంటే అధికారులకు విన్నవించుకోవాలి తప్ప దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎక్కడినుంచి మా ప్రాంతానికవచ్చి మా గుట్టలపై ఎందుకు గుడిసెలు వేస్తారని వారు దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అదికారులు చోద్యం చూస్తున్నారు. గత కొద్ది రోజులుగా పేదలు గుడిసెలు వేస్తుంటే ఏ హక్కుతో వేస్తున్నారని వారు ప్రశ్నించిన వారు లేరు. ఆరోజే వారిని ప్రశ్నించి నిలదీసి ఉంటే ఈరోజు ఇంత జరిగేది కాదని పలువురు అంటున్నారు. సాయంత్రం వరకు పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించడంతో ఇరువురి మధ్య సందికుదిర్చారు.ఈ విషయం టీడీపీ నాయకురాలు విజయమ్మ దృష్టికి వెళ్లడంతో అధికారులకు చెప్పి కేసులు లేకుండా చూడాలని తెలిపారని సమాచారం.



## ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా

కడప క్రైం, జులై 17, ప్రభాతవార్త:



ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారిగా వారి సమస్యలు పోలీసుల వైపు నుంచి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కడప జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని దేవుని కడప, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నేరుగా జిల్లా పోలీసు కార్యాలయం చేరుకొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు ఎస్పీగా తనను సీఎం నియమించడం సంతోషంగా ఉందని కడప జిల్లా ప్రజలకు సేవలు చేయడానికి ముందుంటానన్నారు. జిల్లాలో ఉన్న పరిస్థితులను కూలంకషంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో కింది స్థాయి సిబ్బందితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతానని, గంజాయి విక్రయాలు, భూకబ్జాలు, క్రికెట్ బెట్టింగ్ ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ప్రభుత్వ ప్రాధాన్యమైన ప్రజా ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. నగరంలో సీసీ కెమెరాల పనితీరు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు, పాత్రికేయులు రాజకీయ ఎపార్టీల నాయకుల కృషితో పోలీసు సంబంధ పరమైన సమస్యను పరిష్కరించి చెప్పడానికి కంటే చేసి చూపిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం అదనపు ఎస్పీ లోసారి కృధాకర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్ ఇతర అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

### వైసిపి ప్రభుత్వ పాలనపై

## రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 17, ప్రభాతవార్త:

వైసిపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల పాలనలో జరిగిన అక్రమాలపై టిడిపి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసినట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 1,75,000కోట్లు భూ అక్రమాలు జరిగినట్లు తెలిపారు. అలాగే ఇసుక అక్రమ రవాణాలో 10వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆధారాలతో సహా బయటపెడుతున్నామని వివరించారు. వైసీపీ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం దుర్మార్గం అన్నారు. టిడిపి అదికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ చట్టాన్ని రద్దు చేశారని ఈ సంధర్బంగా చంద్రబాబు ఆ చట్టాన్ని రద్దు చేశారని ఈ సంధర్భంగా తెలిపారు. సర్వే పేరుతో ప్రజల భూముల సర్వే రాళ్లపై మరియు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోలు వేయడం సరైన చర్య కాదన్నారు. గుజరాత్ రాష్ట్రంలో భూమి అక్రమణదారుడు కోర్టులో రుజువు చేసుకోవాలని, అలాంటి చట్టం ఏపీలో రావాలని ఆకాంక్షించారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఆయన అన్న ఎక్కడ పడితే అక్కడ భూములను అక్రమించుకున్నారని, ఇసుక దందా అంతా ఇంతా లేదని విమర్శించారు. ఋషికొండలో కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇసుక విధి విధానాలలో రవాణా ఖర్చులు మాత్రమే ప్రభుత్వం వసూలు చేస్తుందని కానీ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి దగ్గరలో ఇసుక డంపు లేకపోవడంతో అధిక ధర పడే అవకాశం ఉందన్నారు. ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక డంప్‌ను ఏర్పాటుచేయాలని కలెక్టర్‌ను కోరుతామన్నారు. ఇంత అరాచకపాలన వెంటనే గుర్తించిన ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని కట్టిన సంధర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈవి సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తలారి పుల్లయ్య, ఎర్రన్న, మాజీ పట్టణాధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## పింఛ ప్రాజెక్టు పరిశీలన

సుండుపల్లె, జులై 17, ప్రభాతవార్త:



సుండుపల్లె మండలం పర్యటనలో భాగంగా బుధవారం పింఛ ప్రాజెక్టును రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాల సుబ్రమణ్యం పరిశీలించి అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే ప్రాజెక్టుకు కావాల్సిన కార్యకలాపాల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రాజెక్టుకు కావాల్సిన డాక్యుమెంట్లు పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు కల్లే రెడ్డప్ప, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్ నాయుడు, మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు నాయుడు, శివరాం నాయుడు, కురువపల్లి చంద్రమోహన్, మల్లేపేట సురేష్ నాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తప్పుడు వార్తలు మానుకోవాలి



చాపాడు, జూలై 17, ప్రభాతవార్త:

వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు అసమర్థ పాలనపై, మాజీ ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే వైసీపీ ప్రభుత్వంలో ఉండిన పే టీఎం సంఘానికి, తప్పుడు రాతలు రాసిన వారికి వెన్నులో వణుకు పుడు తుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎప్పుడైన శేతపత్రం విడుదల చేసి ప్రజలకు తెలియప రచారా అని ఎద్దేవా చేశారు. చేతగాని పాలనలతో రాష్ట్రాన్ని చెత్తగా మార్చారని విమర్శించారు. ఢిల్లీకి వెల్లిన ప్రతి సారి రాష్ట్ర అభివృద్ధి గురించి ఏరోజు చర్చించలేదన్నారు. అభివృద్ధి చేయాలనుకుంటే పోల వరం కేంద్ర నిధులతో ఎందుకు పూర్తి చేయలేదన్నారు. మచిలీపట్నంలో ప్రభుత్వం ఏర్పడిన 35రోజుల లోనే 75వేల కోట్లతో రిఫైనరీ ప్రాజెక్ట్ తెచ్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వందేనని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వానికి సలహాలు ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయవలసినదిగా కోరారు.

## సెప్టెంబర్ 28, 29 తేదీలలో టైప్ పరీక్షలు



ప్రొద్దుటూరు, జూలై 17, ప్రభాతవార్త:

సెప్టెంబర్ 28, 29 తేదీలలో టైప్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హాండ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ గిద్దలూరు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ వారిచే నిర్వహించు మ్యానువల్ టైప్ రైటింగ్ పరీక్షలను స్టేట్ టెక్నికల్ బోర్డ్ వారు సెప్టెంబర్ 28,29 తేదీలలో టైప్ పరీక్షలను ఇంగ్లీష్, తెలుగు భాషలలో లోయర్, హైయ్యర్ గ్రేడ్ మరియు హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలను, హిందీ లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35కేంద్రాలలోనూ, తెలుగు, ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబర్ 21,22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా 6కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రమును రద్దు చేసి, గుంటూరు నందు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలకు ఇంకా 75రోజులు సమయం ఉన్నందు వలన, వెంటనే స్థానికంగా ఉన్న టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ వారిని సంప్రదించి సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించి, పరీక్షలలో కృతార్థులై త్వరగా ఉద్యోగాలు పొందవచ్చునని ఆయన సూచించారు.

## గంగ రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు

దువ్వూరు, ,జూలై 17, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చల్లబసాయి పల్లె వద్ద గల తెలుగు గంగ రిజర్వాయర్‌లో పూర్తిగా నీరు అడుగంటింది. పూర్తిగా నీరు లేకపోవడంతో రిజర్వాయర్ అడుగంటిపోయింది. తెలుగుగంగ ప్రాజెక్టులో భాగమైన రిజర్వాయర్‌లో 2.3టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. అయితే గత ఏడాది వర్షాలు రాకపోవడంతో తెలుగు గంగ రిజర్వాయర్‌కు ఎటువంటి నీటిని విడుదల చేయలేదు. దీంతో ఉన్న నీటని వాడుకుంటూ పోయారు. గత 3నెలలుగా రిజర్వాయర్ వద్ద గల గేట్ల వద్ద కూడ నీరు లేకపోవడంతో రిజర్వాయర్ ఎడారిని తలపిస్తోంది. గత 10సంవత్సరాల నుండి నిండుకుండలా ఉన్న తెలుగుగంగ రిజర్వాయర్ ఈ ఏడాది మాత్రం అడుగంటిపోయిందని రైతులు భావిస్తున్నారు.తెలుగుగంగ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో సమీప గ్రామాల్లో ఉన్న బోర్లు కూడ నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయింది. ఈ బోర్లలో నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్‌లో పూర్తిగా నీటి మట్టం తగ్గిపోవడంతో మండలంలోని సుమారు 15గ్రామాల్లో భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోయాయి. అలాగే తెలుగుగంగ రిజర్వాయర్ నుండి, దువ్వూరు, చింతకుంట చెరువులకు నీరు విడుదల చేసేవారు. ఆ రెండు చెరువుల్లో కూడ ఎటువంటి నీరు లేదు. దీందో భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోవడంతో సమీప గ్రామాల్లో రైతులు పొలాలు సాగు చేయాలంటే భయపడుతున్నారు.ఈ ఏడాదైనా సకాలంలో వర్షాలు వచ్చి శ్రీశైలం నుండి వెలుగోడు రిజర్వాయర్‌కు నీరు వస్తే ఆ నీటిని తెలుగుగంగ రిజర్వాయర్‌కు మళ్లించవచ్చు. వర్షాలు సకాలంలో రావాలని రైతులు కోరుకుంటున్నారు.

## వైభవంగా మొహరం వేడుకలు



దువ్వూరు, జూలై 17, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు, ఎర్రబల్లి, గుడిపాడు తదిరత గ్రామాల్లో బుధవారం మొహరం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా దువ్వూరులో బంగారు పీరు, బాదుల్లా పీరు అలాగే చిన్న పీర్లను ముస్లిం సోదరులు ఊరేగించారు. ఈ సంధర్భంగా బాణాసంచా పేల్చుతూ దప్పు వాయిద్యాలతో మొహరం పండుగ ప్రాధాన్యతను తెలియజేశారు. మొహరం పండుగ వేడుకల్లో ముస్లిం సోదరులతో పాటు ఇతరులు మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు.

## డిఐఓ పూల్ భాషోపాధ్యాయులను ఉన్నతీకరించడానికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:



స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో బుధవారం డిఇఒ పూల్‌లోని ఉర్దూ పండితులు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, అధ్యక్షులు అంకాల్ కొండయ్యలను కలిసి గత నాలుగేళ్లుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి వివరించారు. ఈ సంధర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ కృషి వలన కొన్ని జిల్లాల్లో పూర్తిగా భాషోపాధ్యాయులు ఉన్నతీకరించబడినారని అనానరు. రెండు, మూడుజిల్లాల్లో మిగిలి డీఈఓ పూల్‌లో ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ పండితులు వారి కేడర్ పోస్ట్ రద్దు కావడంతో గత నాలుగేళ్లుగా సరైన ఖాళీలు కేటాయించబడక ప్రతి బదిలీల్లోనూ బలవంతంగా మార్చబడుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. వీరందరిని ఉన్నతీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భాషోపాధ్యాయలందరూ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థకు బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, ఉర్దూ పండీతులు రోషన్, ఎగ్బాల్, షేర్‌ఖాన్ ఇంకా పదిమంది మహిళా ఉర్దూ ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

## మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:

స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఒక్క నెల బాబుకి రక్తం తక్కువగా ఉండటంతో ఏ పాజిటివ్‌రక్తం అత్యవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యుడు పీరయ్య చేత రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మోరె లక్ష్మన్‌రావు, ఫౌండేషన్‌టౌన్ వైస్ ప్రెసిడెట్ శ్రీకాంత్, సుమన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి జీఆర్‌ఎంఆర్

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:



వికలాంగుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గురిజాల రామమోహన్ రెడ్డి అని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పీఎస్) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం స్థానిక మైదుకూరు రోడ్డులోని మండి మార్కెట్ సమీపంలో గురిజాల రామమోహన్ రెడ్డి కార్యాలయాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సంధర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ తొలి ఏకాదశి పర్వదినం రోజున ప్రొద్దుటూరులో వికలాంగుల హక్కుల పోరాట నాయకుడు, ప్రస్తుతం జాతీయ స్థాయిలో పోరాడుతున్న రామ్మోహన్ రెడ్డి కాంప్లెక్స్ ఏర్పాటుచేయడం ఆనందదాయకం అన్నారు. ఈ సంధర్భంగా ఆమ్మోహన్ రెడ్డిని జాతీయ కోర్ కమిటీ సభ్యునిగా నియమించారు. తానే చేసిన ప్రతి ఉద్యమంలో తనకు ఆర్థిక తోడ్పాటు, సహకారం అందించే రామ్మోహన్ రెడ్డి మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, విహెచ్ పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోరుమామిళ్లలో ఘనంగా మొహరం వేడుకలు

పోరుమామిళ్ల, జూలై 17 ప్రభాతవార్త :



పట్టణంలో మొహరం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ ఎత్తున ముస్లిం సోదరులు రోడ్డు పొడవునా పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా జరగని విధంగా అత్యంత వైభవంగా జరగడంతో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత ప్రజలు పీర్ల ఊరేగింపు చూసేందుకు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపులో ప్రత్యేక వేషధారణలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## శ్రీమస్తాన్ స్వామి ఉరుసు మహోత్సవాలు

పెండ్లిమర్రి, జూలై 17, ప్రభాతవార్త:

మండలంలోని కొండూరు గ్రామంలో శ్రీ మస్తాన్ స్వామి ఉరుసు మహోత్సవాలు నేటి నుంచి రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కొండూరు గ్రామ ప్రజలు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## నందలూరు బాలుర బిసి గురుకుల పాఠశాలను నిర్మించండి

నందలూరు,జులై 17,ప్రభాతవార్త:

నందలూరు మండలంలో బీసీ బాలురు గురుకుల పాఠశాలను నిర్మించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సువిత ను కోరారు.బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం బీసీ శాఖ మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బీసీ విద్యార్థులు ఉన్నారని,వారికి అనుగుణంగా నందలూరు మండలంలో బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని కోరమన్నారు. నందలూరు లో అన్ని వసతులు ప్రభుత్వ స్థలము మంచి వాతావరణం స్వచ్ఛమైన నీరు అన్నిటికీ అణువుగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకోవడం జరిగింది అన్నారు.మంత్రి సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాపురం క్షేత్రంలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

కమలాపురం, జులై 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రామాపుర పుణ్యక్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీమహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత షన్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలసిన ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకున్నారు. తొలి ఏకాదశి కావడంతో ఆలయంలో విశేష పూజలు నిర్వమించారు. ఆలయ ప్రధాన సేవలకు కాశీభట్ల సత్య సాయి నాథ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు జగదీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు హోమాలు చేశారు.

## మాచనూరు చంద్రారెడ్డి మృతి

పెండ్లిమర్రి, జులై 17, ప్రభాతవార్త:

గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ హయాం నుంచి ప్రస్తుతం వైసీపీలో మండలంలోని మాచనూరు గ్రామం పెద్దాయనగా పిలుచుకునే మాచనూరు చంద్రారెడ్డి గత రాత్రి మృతి చెందాడు. తొలి ఏకాదశి నాడే ఆయన మృతి తీరని లోటు. 1973లో మాచనూరు సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు. అలాగే గ్రంథాలయ బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు. ఆయన మృతితో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్మన్ బాలయ్య, పాత సంగటిపల్లి నాగమల్లారెడ్డి, పెండ్లిమర్రి రఘునాథరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు సంగటి గంగిరెడ్డి, మైసూరారెడ్డి, అధికారులు తదితరులు నివాళులు అర్పించారు.

## బి.కొత్తకోటలో ఘనంగా పీర్ల పండగ

బి.కొత్తకోట, జులై 17 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో మొహరం పండుగను ముస్లిం సోదరులు కులమతాలకు అతీతంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామీణులు పీర్ల పండగను డప్పు వాయిద్యాల నడుమ ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ పండగ వేడుకలను పీర్లను చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు. పీర్లకు ప్రత్యేకంగా అలంకరించి ఆయా గ్రామాల భక్తులు పూలు, దట్టీలు సమర్పంచారు. తెల్లవారుజామున మొహర్రం పండుగలో భాగంగా పీర్ల సవారీతో గ్రామ పురవీధుల్లోకి రాగా భక్తులు దారి పొడవునా నీరుపోసి మొక్కులు తీర్చుకన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పిండ మార్పిడి ద్వారా ఒంగోలు గిత్త జననం

రైల్వేకోడూరు,జులై 17,ప్రభాతవార్త:



రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నటువంటి పిండ మార్పిడి విధానంలో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట పశువైద్యశాలకు చెందిన జ్యోతి కాలనీ గ్రామంలో కుళాయి లక్ష్మీదేవి అనే రైతులకు చెందిన జెర్సీ ఆవుకు పిండ మార్పిడి విధానం ద్వారా ఒంగోలు జాతి పిండాన్ని 2023వ సంవత్సరం సెప్టెంబర్ నెల 29వ తేదీన ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ పశువు యొక్క చూలునిర్ధారణ 2023వ సంవత్సరం డిసెంబర్ 27 తేదీ జరిగింది.అత్యంత ఉత్తమ జన్యులక్షణాలు కలిగనటువంటి ఒంగోలు జాతి కోడెదూడ జులై 16వ తేదీన రాత్రి జన్మించిందని వారు తెలిపారు. ఈ యొక్క పొండ మార్పిడి విధానంలో ముఖ్య భూమిక పోషించినటువంటి రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు,గుంటూరు లమ్ ఫామ్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ అదనపు సీఈవో డాక్టర్ రజనీకుమారి,ఒంగోలు జాతి పిండాన్ని ల్యాబ్ లో తయారు చేసే విధానంలో పాత్ర పోషించినటువంటి డాక్టర్ శ్రీమన్నారాయణ,డాక్టర్ శ్రీకాంత్,కడప జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్,వి ఏ ఎస్ డాక్టర్ శివరామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటూ శెట్టిగుంట డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ఈ పిండ మార్పిడి విధానం ద్వారా అంతరించిపోయే దగ్గర్లో ఉండే పశువుల్ని కాపాడుకోవడానికి,అత్యంత ఉత్తమ జెన్యూ లక్షణాలు కలిగినటువంటి పశువులను త్వరితగతిన అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

## ప్రజా సేవే నేను నేర్చుకున్న విద్య:ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు,జులై 17,ప్రభాతవార్త:



నా రాజకీయ గురువు ప్రముఖ పారిశ్రామికవేత్త రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి ఆశీస్సులతో రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గ ప్రజా సేవకే అంకితమై పని చేస్తానని రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు.బుధవారం రైల్వేకోడూరు టిడిపి కార్యాలయం నందు ప్రత్యేక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజా సేవకై అంకితమై పనిచేస్తానని ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తమ అధిస్టాన నాయకుడు ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధి నిధులకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.ముఖ్యంగా రానున్న వర్షాబావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఐదు మండలాల ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు అందుబాటులో ఉండాలని ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు సకాలంలో మందులను మరియు సూదులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు.ముఖ్యంగా పెండింగ్లో ఉన్న బ్రిడ్జి పనులు రోడ్డు పనులు రైతులకు ఇచ్చిన హామీలు తదితర వాటిపై త్వరలోనే ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో రూపానంద రెడ్డి ఆదేశాలతో పనిచేస్తానని అన్నారు.ముఖ్యంగా రైల్వే కోడూరు నియోజకవర్గం గత 15 సంవత్సరాలుగా కాలయాపన చేసిన వైసీపీ నాయకులు పూర్తిస్థాయిలో అభివృద్ధిని మరిచారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్యులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

రైల్వేకోడూరు,జులై 17,ప్రభాతవార్త:



నిరుద్యోగులకు సదా అవకాశం ఉచిత జాబ్ మేళాకు విశేష స్పందన అభించిందని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. బుధవారం కళాశాల మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 24/7 ఏఐ అనే ఇంటర్నేషనల్ కంపెనీ ద్వారా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది.ఈ జాబ్ మేళా నందు దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో మొదటి మరియు రెండవ రౌండు పూర్తిచేసుకుని మూడో రౌండ్ కు 15 మంది విద్యార్థులు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు.ఎంపిక అయిన ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు నియామక పత్రాలు కూడా అందజేయడం జరిగినట్లు తెలిపారు.మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ చిత్తూరు కడప జిల్లా ప్లేస్మెంట్ ల అధికారి వెంకటప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ నుంచి గురుసాయి, సుబ్రహ్మణ్యం, సాయి కృష్ణ, మరియు సాయి డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎస్ ఉపేంద్ర, మరియు కళాశాల ప్లేస్మెంట్ అధికారి అడపాల శివకుమార్ పాల్గొన్నారు.

## జూలై 18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

బద్వేలు, జూలై 17 ప్రభాతవార్త :

ఈ నెల 18వ తేది నుంచి 28వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా జనసేన4 వ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనసేన కో ఆర్డినేటర్ తుడిమెళ్ల మురళి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం మరియు గ్రామంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన అభ్యర్థి పవన్ కళ్యాణ్ కార్యకర్తలకు అండగా ఉండేందుకు ఒక సభ్యత్వ నమోదుకు రూ.5లక్షల ప్రమాదబీమా వర్తించేలా ఏర్పాటు చేశారన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి కార్యకర్త ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ సభ్యత్వం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం బద్వేలులో కూడా నిర్వహించేందుకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దద్దం వెంకటేశ్వర్లు (డి.వి.), కొర్రపాటి సురేంద్ర, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, బాసికాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వన్‌టౌన్, మహిళా పీఎస్, టుటౌన్, కమాండ్ కంట్రోల్‌ను ఆకస్మిక తనిఖీ

కడప క్రైం, జులై 17, ప్రభాతవార్త:

కమాండ్ కంట్రోల్ సెంటర్ వీడియో వాల్‌ను బుధవారం నూతన ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వన్‌టౌన్, టుటౌన్, మహిళా పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది బాధ్యతా యుతంగా తమ విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్, డయల్ 100, 112, నగరంలోని సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. చోరీల నివారణకు రాత్రి పూట గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్, కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టుటౌన్ సీఐ ఇబ్రహీం, సిబ్బంది ఉన్నారు.

## దొందు-దొందే

### అధికారులది అక్రమం - అక్రమార్కులతే ఆక్రమణం

### కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జా

రాజంపేట/ రైల్వే కోడూరు అర్బన్,జులై 17,ప్రభాతవార్త :

అధికారులు ఉన్నచోట ఆక్రమణదారులు ఉండరు. ఆక్రమణ దారులు ఉన్నచోట ప్రభుత్వాధికారులు ఉండరు. వీరిద్దరు ఉండే చోట కోట్ల విలువ చేసే ప్రభుత్వ కాలీ స్థలాలు అసలే ఉండవు. దొందు దొందే అన్న చందంగా ప్రభుత్వ భూములను కబ్జాదారులు కంటికి కనపడితే చాలు పట్టపగులే యదేశ్చగా ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టేస్తున్నారు. ఇది ఎక్కడో కాదు నియోజక వర్గ కేంద్రమైన రైల్వే కోడూరు పట్టణ పంచాయితీ పరిధిలో జరుగుతున్న భూకబ్జాలు. అది ఎంత అక్రమమైనా తెలిసినప్పటికీ వాటిని అరికట్టి ప్రభుత్వ స్థలాలు కాపాడాల్సిన అధికారులే వారికి అండగా నిలిచి అక్రమాలు సక్రమమం చేసే తీరులో అక్కడున్న అధికారులు వ్యవహరిస్తున్న వైనం చేస్తుంటే ఉమ్మడి కడప జిల్లాలకే భూకబ్జాల పంచాయితీగా రైల్వేకోడూరు పంచాయితీ కావడం విశేషం కోడూరు పట్టణానికి చుట్టూ నదీ ప్రవాహం, ఏటి పరంపోగు ఇరిగేషన్ స్థలాలే ఉన్నాయి ఇవి పట్టణాన్ని ఆనుకొని ఉండడంతో ఒక్కో సెంటు స్వొంత స్థలం ఉంటే చాలు దాని ద్వారా మిగిలిన ఎకరాల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి కోట్లాది రూపాయలు దండుకోవడం కోడూరు పట్టణానికే కొండంత పేరు వచ్చింది. అందరూ అందరే అన్న చందంగా అటు రెవెన్యూ, గ్రామ పంచాయితీ వీరిద్దరి నడుమన రిజిస్ట్రేషన్ అధికారులు ఒకరికి ఒకరు చేతులు కలుపి దొంగలు ఊర్ల ను పంచుకున్న చందంగా పట్టణంలోని కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసేస్తున్నారు. రెవెన్యూ శాఖ అక్రమాలను సక్రమమం చేస్తే పంచాయితీ శాఖ వారు భూకబ్జాదారులతో చేతులు కలపి ప్రజా ఆదాయానికి గండి కొట్టి అక్రమ సంపాదన విపరీతంగా దోచుకున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరికి తగ్గట్టుగానే సబ్ రిజిస్ట్రర్లు కూడా నెంబర్లు మార్చి ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్‌లు చేసి బాగానే దోచుకున్నట్లు తెలుస్తోంది. వీరు ముగ్గురు ఏకం కావడం అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కోట్లాది రూపాలయలను నిలువునా దోచుకుంటూ ముగ్గురు పంచుకొంటున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై తాహాశీల్దారు శివరాముడును వివరణ కోరగా చట్టం తన పని తాను చేస్తుందని జరుగుతున్న అక్రమ కట్టడాలను ఆపాల్సి న అవసరం లేదని బాధ్యతా రాహిత్యమైన సమాదానం ఇచ్చారు. కోడూరు పట్టణ పంచాయితీ ఈఓ ప్రసాదరావును వివరణ కోరగా ఎలాంటి అనుమతులు పంచాయితీ ఇవ్వలేదని అధికారులు ప్రజాప్రతినిధుల క్రింద పని చేస్తున్నారని అక్కడ ఖర్చు చేసిన నిధులన్నీ సంబంధిత ప్రజాప్రతినిధుల ఆదేశఆల మేరకే జరిగాయని శాఖా పరంగా ఎలాంటి అనుమనుతు ఇవ్వలేదని సమాదానమిచ్చారు.

## ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కేవి సేవలు అభినందనీయం

బద్వేలు అర్బన్, జూలై 17 ప్రభాతవార్త :



బద్వేలు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆర్యవైశ్యులకు ఏసమస్య వచ్చినా అండగా ఉంటూ వారికి అండగా ఉంటున్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు సేవలు మరువ లేనివని సూర్య యూత్ స్టైల్ అండ్ మెన్స్‌వేర్ వల్లంకొండు సూర్య నారాయణ, ఎస్‌వి.సుబ్బారావు, దర్శి వెంకటసుబ్బయ్య సుబ్రమణ్యం, చింతకుంట చెన్నక్రిష్ణ, చిన్ని శ్రీనివాసులు, దర్శి వెంకటేశ్వర్లు, మదళ్లపల్లె వాసు, భూపాళం రాఘవేంద్రరావు, గ్రంధి సుమన్, చలపాటి రవి పలువురు అన్నారు. బాలాజీ గ్రూప్ ఎండీ కేవి.సుబ్బారావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుదవారం ఆయన సేవలను గుర్తించి వాసవి కన్యకా పరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో పలువురు షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారులు వారికి బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికి ప్రత్యేక కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారిశాల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టినినాటినుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారిశాల అబివృద్ధికి కృషిచేస్తూ నిరుపేద ఆర్యవైశ్యులు వ్యాపారం చేసుకునేందుకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి 24 రూములను ఏర్పాటు చేయడం ,అలాగే గతంలో ఆర్యవైశ్య స్మశాన వాటిలో ఆకస్మాత్తుగా మరణించినపుడు అంత్యక్రియలు చేసుకునేందుకు వస్తువులు లేక ఇబ్బందులు పడేవారని అయితే ఆర్యవైశ్య స్మశాన వాటికను సుందరీకరణ చేసి మృతి చెందిన వారి అంత్యక్రియలు చేసుకునేందుకు పూర్తి సహకారం అందించడం, అలాగే నిరుపేదలకు సేవలందించిన కేవి.సుబ్బారావు ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో చేసుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, కౌన్సిలర బండి చెన్నయ్య, దుద్యాల సత్యనారాయణ, రిటైర్డ్ ఎంప్లాయి బాలయ్య, సూర్యయూత్‌స్టైల్ సిబ్బంది, మిష్టర్‌చాయ్ సుబ్రమణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పలు ఆలయాలలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

బద్వేలు అర్బన్, జూలై 17 ప్రభాతవార్త :





తొలి ఏకాదశి సందర్భంగా బుదవారం బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం, సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం, తెలుగుగంగ రోడ్డులోని అనంతపద్మనాభ స్వామి ఆలయం, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు పలు ఆలయాలలో పలువురు భక్తులు తెల్లవారుజామునుంచే ఉపవాసంతో స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు.హిందూ సాంప్రదాయంలో ఏ మంచి పని ప్రారంభించాలన్న దశమి, ఏకాదశిలు ముఖ్యమైన రోజులుగా భావిస్తారు. ఏడాది పొడవునా ఉండే ఆషాఢ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా పూర్వకాలం నుంచి భక్తులు తమ భక్తిని చాటు కుంటుండేవారు ఆషాడ శుద్ధ ఏకాదశని తొలి ఏకాదశిగా జరుపుకోవడం పలు ఆలయాలలో విశేష పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు పలు ఆలయాలలో ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించడం జరిగింది.

## ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు



చిట్వేలి, జులై 17, ప్రభాతవార్త:

మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ హిమామ్ హుసేన్ అనుసరించిన ధర్మం, శాంతి, శ్రేయస్సు సమస్త మానవాళికి ఆవశ్యకమని చాటుతూ చిట్వేలిలో, మండల పరిధిలోని నగిరిపాడు, కస్తూరి వారిపల్లిలో మొహరం వేడుకలను ముస్లిం మత పెద్దలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వివిధ పూలతో అలంకరించిన పీర్లను యువత మంగళ వాయిద్యాలతో ప్రధాన వీధుల వెంబడి ఊరేగింపుగా తీసుకెళ్లారు. పెద్ద ఎత్తున యువత నాట్యం చేశారు. ముస్లిం, హిందూ మతస్తులు ఎద్ద ఎత్తున ప్రసాదాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తదుపరి పీర్లను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం గావించారు. మతాలకతీతంగా నిర్వహించిన ఈ వేడుకలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ గట్టి భద్రతా చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో హిందూ ముస్లిం మత పెద్దలు, మహిళలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలి

బద్వేలు అర్బన్, జూలై 17 ప్రభాతవార్త :



ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పర్యవేక్షించేవిధంగా బాద్యతగా తీసుకోవాలని బీజేపీ నాయకులు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం బి.కోడూరు, బద్వేలు మండలాల పరిధిలోని పలు ప్రాంతాలలో వివిద రకాల మొక్కలను గ్రామస్థులతో కలిసి పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి మొక్కలను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో అధికశాతం మొక్కలు నాటేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు కృషిచేయాలన్నారు. పచ్చని చెట్లు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని ఇస్తాయని తద్వారా స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవచ్చన్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల ఆవశ్యకతను తెలుసుకుని జీవించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరీ బాధ్యత అని, మొక్కలతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమన్నారు. భవిష్యత్ తరాలకు మొక్కల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

## బీసీ భవన్‌కు కంప్యూటర్లను అందించాలి

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:



కడప నగరం పాత రిమ్స్‌లో నిర్మించిన బీసీ సంక్షేమ సంఘం భవనానికి కంప్యూటర్లను అందించాలని అదే విధంగా చిన్నపాటి గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి కోరారు. ఈ మేరకు కలెక్టరు శివశంకర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టరుకు కంప్యూటర్లను అందించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రం, కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు ఖాదర్ బాషా, గంగయ్య, రంగయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన దురహంకారిపై చర్యలు తీసుకోవాలి

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:

దళిత వ్యక్తి కదిరి ప్రభాకర్‌పై వేడి నూనెతో దాడి చేసి అగ్రకుల దురఅహంకారి దుర్మార్గుడైన చిన్నప్పగారి గజ్జల వెంకట సుబ్బారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ్‌శేఖర్ కలెక్టరును కోరారు. అరంతరం ఆయనకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సురేష్; భాస్కర్, దినేష్, డేవిడ్, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:

మీడియాపై అనుచిత వ్యాక్యలు చేసిన వైసీపీ నేత ఎంపీ విజయసాయిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిజంను కించపరిచేలా మాట్లాడిన బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## నూతన ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:

నూతన ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీని పలు సమస్యలను ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్దార్, హఫీజ్, షాబుద్దీన్, జావీద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు కాని డ్రెస్ కోడ్

కలికిరి, జులై 17, ప్రభాతవార్త:

కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి మండలం కేంద్రంలోని పీహెచ్‌సీలలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యాధికారులు విధి నిర్వహణలో కచ్చితంగా డ్రెస్ కోడ్ పాటించాలని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలున్నప్పటికీ కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు డ్రెస్ కోడ్ పాటించడం లేదు. వవైద్యాధికారులు న్యాఫ్‌రాన్, మెడలో స్టెతస్‌కోప్ పెట్టుకుంటే రోగులకు వైద్యాధికారి అని తెలుసుకోవడం సులభంగా ఉంటుంది. కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు ఇవేమి లేకుండా తిరగడంతో వారికి ఎవరో అర్థం కాని పరిస్థితి. పక్క వారిని ఆయన ఎవరు అని అడిగి తెలుసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా పీహెచ్‌సీలలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులకు నిత్యం వందలాది మంది ప్రజలు, రోగులు వస్తుంటారు. వైద్య సిబ్బంది, సిబ్బందే ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది డ్రెస్ కోడ్ అమలయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## మండలంలో తగ్గుముఖం పట్టిన డెంగీ, డయేరియా

కలికిరి, జులై 17, ప్రభాతవార్త:

కలికిరి మండలంలో ఎట్టకేలకు డెంగీ, డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. మండలంలో జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో రామకృష్ణయ్య, మేడికుర్తి వైద్యాధికారి డా.చిన్నరెడ్డప్ప, పంచాయతీలలో ప్రజా ప్రతినిధుల సహకారంతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం అలాగే మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, వైద్యసిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు డెంగీ, డయేరియాపై అవగాహన కల్పించడంతో కలికిరి మండలంలో డెంగీ, డయేరియా తగ్గుముఖం పట్టాయి. వార్త మినీలో డెంగీ, డయేరియా కలకలం వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీవో రామకృష్ణ గ్రామాల్లో పర్యటించి చర్యలు చేపట్టడంతో డెంగీ, డయేరియా తగ్గ ముఖం పట్టాయి.

## వైభవంగా పీర్ల పండగ

పెండ్లిమర్రి, జులై 17, ప్రభాతవార్త:



మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రిలో బుధవారం వైభవంగా పీర్ల పండగ జరిగింది. అలాగే పీర్లను వీధుల్లో డప్పు, వాయిద్యాల మధ్య వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ నాగరాజు పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పీర్లు జల్ది కార్యక్రమం

చిన్నమండెం, జూలై 17, ప్రభాతవార్త :



గత పది రోజులుగా మండల కేంద్రంలోని పీర్ల మఖాన్ పూజలందుకొన్న ఇమాం హుసేనీ ఆలం, భారా ఇమామ్ అను 32 పీర్ల జల్ది కార్యక్రమాన్ని హిందు, ముస్లిం సోదరులు బుధవారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గంధపు పీరు మఖాన్ నుండి సన్నాయి మేళాల మధ్య సంత తోపు వరకు ఊరేగించారు. ఈ ఊరేగింపులో వివిధ వేష దారణలు వీక్షించడానికి సమీప గ్రామాల నుండి వేలాది మంది తరలి వచ్చారు. మెరువని అనంతరం పీర్లను శుద్ధిపరచి పెట్టల్లో భద్రపరుస్తారు.

## దళితులపై దాడులు నిరోధించాలి

చిన్నమండెం, జూలై 17, ప్రభాతవార్త :

దళితుల మీద జరుగుతున్న దాడుల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుని నింధితులను కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండలం సుధీర్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చిన్నమండెం మండలంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో దళితులు గిరిజనులు బలహీన వర్గాలపై అనేక రకాల దాడులు జరిగాయని, అందుకే వైసిపి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని అన్నారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని నరసాపురం ఆదోని మండలంలో ఇరువురు దళిత మహిళలపై విచక్షణారహితంగా దాడులు జరిగాయని తెలిపారు. అదేవిధంగా కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో ప్రభాకర్ అనే దళిత వృద్ధునిపై వెంకటసుబ్బారెడ్డి అనే అగ్ర కుల వ్యక్తి మరుగుతున్న నూనెను ఒంటిపై పోసి చంపే ప్రయత్నం చేయడం దుర్మార్గమని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా దాడులు కొనసాగుతుండడం బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. తక్షణం దాడుల నిరోధానికి చర్యలు చేపట్టి బాధితులకు రక్షణ కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా సాకు చూపి వైసిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్టాలను మార్పు చేసినందున దళితులపై దాడులు పేట్రేగిపోతున్నాయని, చట్టానికి విరుద్ధంగా స్టేషన్ బెయిల్ మంజూరు చేస్తున్నారని, ఈ ప్రభుత్వం సమీక్షించి ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించేందుకు నింధితులకు కఠినంగా శిక్షించేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు రెడ్డిసుధాకర్, పెద్ద గంగులయ్య, శ్రీనివాసులు, బబాబు తదితరులు పాల్గొన్నారు.




## అస్తిత్వ ఉద్యమాలకు కారంచేడు ఉద్యమమే స్ఫూర్తి

పీలేరు, జూలై 17 ప్రభాతవార్తః



కారంచేడు అమరవీరుల 39వ సంస్కరణ దినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ కూడలి నందు అమరవీరులను స్మరించుకుని అమరవీరులకు ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్, ఎమ్మార్పీయస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్‌లు మాట్లాడుతూ 1985 జూలై 17న కారంచేడులో అహంకారం నిండిన కమ్మ భూస్వామ్యం దళితులను ముక్కలు ముక్కలుగా నరికి దళితవాడను నెత్తుటి కుప్పగా మలచిన మారణకాండకు నేటితో 39 ఏళ్ల గడిచాయి. ఓ దళిత మహిళ ఎదరించడాన్ని జీర్ణించుకోలేని అధికారంతో మదమెక్కిన ఆగ్రామ కమ్మ భూస్వాములు దళితుల గుడిసెల మీద పడి ఎందరో స్త్రీల మీద లైంగిక భౌతికదాడులు చేశారు. కత్తులతో బరిసెలతో వీరంగం సృష్టిస్తూ అగ్రకుల రాక్షస మూకల నుంచి బాధితులను కాపాడే ప్రయత్నం చేసి జరగబోయే మరింత కష్టాన్ని నిలువరించారు. ఎన్నో తరాల నుంచి వివక్షను అణచివేతను వంటివి బిగబట్టి ఉన్న దళితులు కారంచేడు ఊచకోత దారుణాన్ని సహించలేక ఒక్కసారిగా ఉద్యమానికి పూనుకున్నారు. కారంచేడు నెత్తుటి దారిలో మొదలైన ఆదళిత ఉద్యమం రాష్ట్రమంతా విస్తరించింది. ఈఘటన తరువాతే ఎంతో మంది దళితులు తమ అస్తిత్వం కోసం హక్కుల కోసం ఆత్మరక్షణ కోసం పిడికిళ్లు బిగించారు. ఆకారంచేడు ఈదారుణకాండకు వ్యతిరేకంగా దళితుల్లో ప్రతిఘటనలు దేశ వ్యాప్తంగా దళితుల్లో ప్రజాస్వామ్య శక్తుల్లో గొప్ప చైతన్యాన్ని కలిగించింది. ఈఉద్యమ దళిత పోరాట చైతన్యానికి ప్రతీకగా మారిందని కారంచేడు ఉద్యమం జాతీయస్థాయి ఉద్యమానికి నాంది పలికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిర్మూలన చట్టం తెచ్చిందని వీరు తెలిపారు. అగ్రకుల మనువాద పాలకుల పాలనలో కోల్పోతున్న హక్కుల కోసం కారంచేడు అమరుల ఉద్యమస్ఫూర్తితో దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను నిర్మించాలని వీరు కోరారు. ఈకార్యక్రమంలో బాస్ నాయకులు కష్ణయ్య, మల్లికార్జున, హరినాధ, గురవయ్య, నాగేశ్వరరావు, రవీంద్ర, ఆనంద, నాగేంద్ర, సురేంద్ర, ద్వారక పాల్గొన్నారు.

## పీర్లు బేటీతో ముగిసిన మొహరం



కేవి.పల్లె, జూలై 17 ప్రభాతవార్తః

మండలంలో బుధవారం పీర్లు బేటీతో మొహరం పండుగ ముగింపు చేశారు. మండలంలోని లక్ష్మిరెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, చీనేపల్లె, నూతనకాలువ, మారెళ్ల, వగళ్ల, గోరంట్లపల్లె, తిమ్మాపురం, గుండ్రేవారిపల్లె గ్రామాలలో ఈనెలలో నెలవంక దర్శనంతో పీర్లు చావిడిలో ప్రార్థనలు జరిపి పీర్లను నెలకొల్పారు. వారం రోజుల పాటు పీర్ల చావిడిలో ఉదయం , సాయంత్రం వేళల్లో ప్రార్థనలు చేశారు. బుధవారం పీర్లను ఆయా గ్రామాలలో ఊరేగింపు చేశారు. ప్రజలు పీర్లకు పూజలు జరిపారు. సాయంత్రం గ్రామ సమీపంలో ఊరుబయట ప్రాంతాలకు తీసుకునివెళ్లి బేడీలు తొలగించడంతో మొహరం పండుగ ముగిసింది.

## మంత్రికి స్వాగతం

కురబలకోట, జులై 17 ప్రభాతవార్త :

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డికి రాజంపేట పార్లమెంటరీ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ స్వాగతం పలికారు. మంత్రి మదనపల్లె పర్యటనలో భాగంగా బుధవారం సత్సంగ్ ఫౌండేషన్ విచ్చేసిన సందర్భంగా సురేంద్రయాదవ్ మార్యదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట కురబలకోట మండల టిడిపి నాయకులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రాజులు కలరు.



## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

రామసముద్రం, జులై 17 ప్రభాతవార్త :



మండలంలోని లక్ష్మీజనార్థన స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయశుద్ధితో మొదలై పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ పూజారి కులశేఖర్ బటర్, అనీల్‌స్వామిలు భక్తులకు స్వామివారిని దర్శింప చేశారు. దీంతో ప్రజలు మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చెంబకూరు గ్రామంలో వెలసిన గట్టు వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణవీధిలోని కోదండ రామస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు.

## నాసిరకం నారు అమ్ముతున్న నర్సరీలపై చర్యలు తీసుకోండి

కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జములయ్య




మదనపల్లెక్రైం, జులై 17 ప్రభాతవార్త :

నాసిరకం నారు అమ్ముతున్న నర్సరీ యజమానులపై కఠిన చర్యలు చేపట్టాలని ఏపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తెలిపారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏపి కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.జములయ్య మాట్లాడుతూ 20 వేల నుంచి 30వేల ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారని వీరంతా చిన్న, సన్నకారు కౌలు రైతులే కలరన్నారు. రైతులకు నర్సరీ యజమానులు నాసిరకం నారుని అంటకట్టి కోట్లాది రుపాయలు గడిస్తున్నారని రైతులు మాత్రం అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి అనుతులు లేని నర్సరీలను రద్దు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలనో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎల్‌నరసింహులు, బొప్పాయి రైతు సంఘం నాయకులు రామక్రిష్ణ, గంగిరెడ్డి, అనీల్‌కుమార్, గంగరాజు, రామూర్తి, గురునాథ్, బి.నారాయణ, రాఘవేంద్రయాదవ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

పులివెందుల రూరల్, జూలై 17, ప్రభాతవార్త ః

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని వైద్యులు శరణ్య, నవీన్‌కుమార్‌లు అన్నారు. బుధవారం శరణ్య ఆసుపత్రిలో వారి కుమార్తె సాయినవీష పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కాంప్లెక్స్‌లోని రూముల ప్రారంభోత్సవం

ప్రొద్దుటూరు క్రైం, జులై 17, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని వీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి మండి కాంప్లెక్సులోని రూముల ప్రారంభోత్సవానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ దివ్యాంగుల పింఛను రూ.3వేల నుంచి రూ.6వేలు పెరగడానికి కారణం ఆయన పోరాటాలే అని కొనియాడారు. అనంతరం మందకృష్ణ మాదిగను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, జాతీయ అధ్యక్షులు అందే రాంబాబు, గోపాల్‌రెడ్డి, చలపతిరావు, ఖాజా మొయిద్దీన్, యదార్థుడు, లలితమ్మ, సావిత్రి, రషీద్, దివ్యాంగులు పాల్గొన్నారు.



## న్యాయవాదులకు సన్మానం

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:

కడప నగరంలోని ట్రంక్ రోడ్డులో ఉన్న మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ప్రముఖ సీనియర్ న్యాయవాదులు డా.ప్రభాకర్, జాల, బీఎన్.అక్బర్ అలీఖాన్‌లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన చార్టెడ్ అకౌంటెంట్ బ్రాంచ్ మాజీ చైర్మన్ ఆడిటర్ సి.ఎ.కె.ఖాజా హుసేన్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## దళితులకు రక్షణ కల్పించాలి

కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:

కారంచేడు సంఘటన ఎక్కడ పునరావృతం కాకుండా ప్రభుత్వాలు దళితులకు రక్షణ కల్పించాలని దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మడగలం ప్రసాద్ కోరారు. 39 ఏళ్ల కారంచేడు సంఘటన చీకటి రోజును స్మరించుకుంటూ బుధవారం ఆర్టీసీ బస్టాండు అంబేద్కర్ సర్కిల్ నందు కారంచేడు దళిత అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. డబ్బు, పలుకుబడి గల వారు దళితపై విచక్షణా రహితంగా దాడులు, హత్యలు, అత్యాచారాలు చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలోని ప్రస్తుత కూటమి పాలనలో అయినా దళితులకు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో హత్యరాల అభివృద్ధి



రాజంపేట,జులై 17,ప్రభాత వార్త :

ఉమ్మడి కడప జిల్లాలో ఉన్నటువంటి ప్రముఖ శైవక్షేత్రాల్లో హత్యరాల శైవక్షేత్రం పేరుగాంచిందని, ఈ ఆలయ అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా శ్రీకామాక్షి త్రేతేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం ఆలయ విశిష్టత గురించి వివరించారు. స్వామి వావి దర్శన అనంతరం ఆలయ మాజీ చైర్మెన్ పూల నరసింహులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈయతో పాటు కొపూరు సుబ్రమణ్యం నాయుడు సతీష్ కుమార్ రాజు, సుబ్బరాజు, శివకుమార్, సూర్య నారాయణ రాజు, తదితరుల పాల్గొన్నారు.

## విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, జూలై 17, ప్రభాతవార్త ః

జిల్లాలో ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా అన్నారు. వేంపల్లెలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పూడిక తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారులు దృష్టి సారించి గ్రామ పంచాయతీల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోకన్వీనరు దాదాపీర్, మండల సభ్యులు పీర్‌బాషా, ఖాదీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొహరం వేడుకలు

రామాపురం, జులై 17, ప్రభాతవార్త:



మొహరం పండగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో చిట్లూరు, ఒడపల్లి, రాచపల్లి, హసనాపురం, దూదేకులపల్లి, కుమ్మరపల్లి గ్రామాల్లో మొహరం పండగను బుధవారం ఆయా గ్రామాల ప్రజలు హిందూ ముస్లిం సోదరులు కలిసి ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్లను ఏర్పాటు చేసి 9 రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షతో పూజలు నిర్వహించారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

రామాపురం, జులై 17, ప్రభాతవార్త:



మండలంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తొలి ఏకాదశి ప్రీతికరమైన మహావిష్ణువు దేవాలయాలు అత్యంత శోభ సంతరించుకున్నాయి. ఆలయ ధర్మకర్త ముక్కోటి బసిరెడ్డి ఆయన సతీమణి సర్పంచ్ ఆధ్వర్యంలో మహా విష్ణు దేవాలయంలో పూజలను అత్యంత నిర్వహించారు. బుధవారం దక్షిణాయనం ప్రారంభమవుతున్న దృష్ట్యా తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.

## ఆపదలో ఉన్న మిత్రునికి ఆపన్న హస్తం

జమ్మలమడుగు, జులై 17, ప్రభాతవార్త:



పట్టణంలోని పతంగే రామన్నరావు శతాబ్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి షేక్ మహబూబ్ బాషా తల్లి గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తెలుసుకున్న స్నేహితులు రూ.25వేలు నగదు అందజేశారు. పీఆర్ హైస్కూల్ సొసైటీ ఫౌండేషన్ ద్వారా నగదు పోగు చేసి ఇలా తమ స్నేహితులు ఆర్థికంగా ఇబ్బంది పడే వారికి తమ వంతు సాయం చేసేలా సంస్థను స్థాపించుకోవడం జరిగిందన్నారు. తనకు కష్టకాలంలో సాయం చేసిన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పఠాన్ ఖాజా షరీఫ్ ఖాన్, కోవెలకుంట్ల ఖాజా మొహిద్దీన్, మార్తల జయవర్ధన్‌రెడ్డి, బేపారి మహ్మద్ మజహర్ అలీ, పిట్టా రాముడు, సులాకే చక్రపాణి, రామకృష్ణ, రంజిత్‌కుమార్, దక్కన్ నూర్ మహ్మద్, శ్రీనివాసులు, షేక్ హుసేన్‌పీరా, కుండా మురళీ, గఫార్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

జమ్మలమడుగు, జులై 17, ప్రభాతవార్త:



మండల పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో బుధవారం ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ శివనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీబాలాజీ త్రిపుర సుందరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస నెలలో సూర్య భగవానుడు ఉత్తరాయణం ముగిసి దక్షిణాయనంలోనికి ప్రారంభం కానున్న రోజున తొలి ఏకాదశిగా పిలుస్తారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన అలివేలమ్మ శిష్య బృందం ఆలయ ఆవరణలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు.

## 19న డీవైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాప్ జయప్రదం చేయండి

జమ్మలమడుగు, జులై 17, ప్రభాతవార్త:



భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కడప జిల్లా వర్క్‌షాప్ ఈనెల 19వ తేదీన బద్వేలు పట్టణంలో జరుగుతుందని ఈ వర్క్‌షాప్‌ను జిల్లాలోని డీవైఎఫ్ఐ యువజన సంఘం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుడుం ఎల్లయ్య, నంద్యాల తులసీశ్వర యాదవ్‌లు తెలిపారు. నిరఉద్యోగ యువత పక్షాన నిలబడి పోరాడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌టెల్, జియో సర్వీసులను బాయ్‌కాట్ చేయాలి

జమ్మలమడుగు, జులై 17, ప్రభాతవార్త:



జమ్మలమడుగు సీఐటీయూ కార్యదర్శి దాసరి విజయ్ స్థానిక ఎన్జీవో హోంలో మాట్లాడుతూ ఎయిర్‌టెల్, జియో టెలికాం కంపెనీలు పేద, మధ్య తరగతి ప్రజలను రీఛార్జిల సాకుతో నిలువు దోపిడీ చేస్తున్నాయని వెంటనే ఈ నెట్‌వర్క్‌ల సెల్లు రీఛార్జిల కంపెనీలను రాష్ట్ర ప్రజలు స్థానిక ప్రజలు బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ ప్రజల ఆస్తి అయిన బీఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థను అభివృద్ధి చేసి 4జీ, 5జీ సేవలను వెంటనే దేశ రాష్ట్ర ప్రజలకు అందించాలని అందుకు మోదీ సహకరించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ రీఛార్జిలు అన్నిటికంటే తక్కువ రుసుముతో అందుబాటులో ఉన్నాయని ప్రజలంతా బీఎస్ఎన్ఎల్‌కు మారాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అబ్రహాం, రవి, బాషా పాల్గొన్నారు.

## రోడ్డు విషయమై గొడవ - సర్ది చెప్పిన పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, జులై 17,ప్రభాతవార్త:

మండలంలోని కుర్నూతల గ్రామ పంచాయతీలోని మూలపల్లెలో రోడ్డు విషయంపై మంగళవారం చిన్న గొడవ చోటుచేసకుంది.గత ప్రభుత్వంలో ఓబుల్‌రెడ్డి పొలం నుంచి మూలపల్లె రెడ్డివారిపల్లెకు సిమెంటు రోడ్డు వేశారని పొలం యజమాని ఓబుల్‌రెడ్డి సర్వే చేయించడంతో రోడ్డు కొంత భాగం తన పొలంలో వేశారని రోడ్డును కొద్దిగా తొలగించాలని పొలం యజమాని అనడంతో కొంత మంది గ్రామస్తులు ఊరువాల్ల కోసం వేసిన రోడ్డును తొలగించవద్దని అనడంతో చిన్న గొడవ చోటుచేసుకుంది విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురికి సర్దిచెప్పారు.దీంతో ఎటువంటి గొడవలు జరకుండా ఎవరుదారి వారు వెళ్లిపోయారు. రోడ్డు విషయంలో గొడవలకు దిగితే ఇరువురిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. చిన్న సమస్యలు గ్రామ లేవల్లో పరిస్కరించుకోవాలని గొడవలకు దిగకూడదని పోలీసులు హెచ్చరించారు.

## ఘనంగా పీర్లపండుగా వేడుకలు

లక్కిరెడ్డిపల్లె, జులై 17, ప్రభాతవార్త:



కులమతాలకు అతీతంగా నిర్వహించే పండుగ హోహారం(పీర్లపండుగ) మంగళవారం మండలంలోని సిద్దకవాండపల్లె, పంధిళ్లపల్లె, రెడ్డివారిపల్లె, కసూర్తి రాజుగారిపల్లె, కుర్నూతల గ్రామాలల్లో నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. సిద్దకవాండ్లపల్లెలో కొండయ్య పీరును సాంప్రదాయబద్ధంగా కొండయ్య స్వామి వారసులు డాక్టర్ భరత్ కుమార్, విజయభాస్కర్, దేవదాసు దంపతులు పాల్గొని కొండయ్య పీరుకు బాష్యం సమర్పించి పీరును ఎత్తుకొని ఊరేగింపు చేశారు పంచదార ప్రసాదంగా సమర్పించి పీరును ఎత్తుకున్న భక్తులు అగ్ని గుండంలో ప్రవేసించారు. భక్తులు చాలా మంది పీర్లు ఎత్తుకొని అగ్ని గుండంలోకి ప్రవేశించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం సిద్దకవాండ్లపల్లె కొండయ్య సమాది కలుసుకొని అక్కడ నుండి ప్రార్థరలు చేసుకొని అనంతరం జల్లీకి(నిమజ్జనం)వెల్లాయి. ఈ కార్యక్రమంలో పూజారులు భాష, బొమ్మనసాబ్, సిద్దక వెంకటరవి రెడ్డి, అజంతుల్ల పాల్గొన్నారు.

# అత్యంత ఘనంగా గంధపు పీరు భాషికం మెరువని





**చిన్నమండెం, జూలై 17, ప్రభాతవార్త :**
జిల్లాలోనే అత్యంత ఘనంగా జరిగే మొహరం పండుగ ఉత్సవాలు మంగళవారం రాత్రి గంధపు పీరు భాషికం మెరువని మండల కేంద్రంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భాషికం ఇచ్చు కడపకు చెందిన రియాజ్ దర్గా నుండి రాత్రి 10 గంటలకు కడప దర్గా గురువు హజ్రత్ ఆరీఫుల్లా హుసేనీ చదివింపులు చేసి భాసికం మెరువని ప్రారంభించారు. అక్కడ నుండి భాషికాన్ని తలపై ఉంచుకొని బళ్లారి డ్రమ్ము వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మధ్య పుర వీధులలో ఊరేగించారు. తెల్లవారుజామున భాషికాన్ని గంధపు పీరుకు అలంకరించారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలలో డ్రమ్స్ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. బుధవారం రాత్రి కొబ్బరి దివిటీల మధ్య గంధపు పీరు మెరువని జరుగుతుంది. రెండు రోజులు ముస్లీం సోదరులు ఎక్కడ ఉన్నా ఈ పండుగకు తరలివచ్చారు. ఇందులో భాగంగా స్థానికులే కాకుండా మహారాష్ట్ర, చెన్నై, తెలంగాణ, కర్ణాటక, గల్ఫ్ నుండి కూడా ముస్లీం సోదరులు వేలాదిగా తరలివచ్చి భాషికం మెరువనిలో వేలాదిగా పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిచే బాబాజి గురు ఆలయం ప్రారంభం

### సత్సంగ్ ఆశ్రమంలో పూజల్లో పాల్గొన్న మంత్రి



**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**
పట్టణ సమీపంలోని సత్సంగ్ ఆశ్రమంలో కేంద్ర రోడ్లు, రవాణాశాఖామంత్రి నితిన్‌గడ్కరి బుధవారం శ్రీ ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహిత శ్రీఎం.ముంతాజ్‌అలీ చేతల మీదుగా కేంద్ర మంత్రి ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆలయంలో పూజల్లో పాల్గొని ధ్యానం చేశారు. పూజా కార్యక్రమం జరిగినంతసేపు దీపారాదనను పూజించారు. సత్సంగ్ ఆశ్రమంలో కేంద్రమంత్రి సుమారు 2.30గంటల సేపు గడిపారు. పూజలు అనంతరం చిప్పిలి వద్ద ఏర్పాటు చేసిన హెలిక్యాప్టర్‌లో తిరుపతి ఎయిర్‌పోర్టుకు వెళ్ళారు. కేంద్రమంత్రి సత్సంగ్ పౌండేషన్‌కు విచ్చేసినపుడు హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అటునుంచి కేంద్రమంత్రి వెంట ఆశ్రమం వరకు వచ్చి వెళ్ళారు. ఆలయ ప్రారంభ కార్యక్రమంలో కేంద్రమంత్రితో పాటు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సత్సంగ్ పౌండేషన్ కమిటీ సభ్యులు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఎల్లంపల్లి ప్రశాంత్, టిడిపి నాయకులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంచీనయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో మదనపల్లె డిఎస్‌పి రామప్రసాద్‌రెడ్డి గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసి పర్మద్‌అహ్మద్‌ఖాన్‌లు విచ్చేశారు.

## మదనపల్లెలో రాష్ట్ర మంత్రికి ఘన స్వాగతం

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**



రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డికి మదనపల్లెలో ఘన స్వాగతం పలికింది. మంత్రి పదవి చేపట్టిన తరువాత తొలిసారిగా ఆయన మదనపల్లెకు విచ్చేయడంతో కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పార్టీ కార్యాలయంకు వెళ్ళడంతో మంత్రికి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామచంద్రరెడ్డిలు స్వాగతం పలికారు.

## వెంకటేశ్వరుడికి అందని నిత్య కైంకర్యాలు

**వేంపల్లె, జూలై 17, ప్రభాతవార్త :**
వేంపల్లెలో కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామికి నిత్య కైంకర్యాలు అందడం లేదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏటా రూ.కోటికి పైగా ఆదాయం ఆలయానికి వస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల స్వామివారికి సేవలు అందించకపోవడం దారుణం అన్నారు. శ్రీ మహావిష్ణువు యోగ నిద్రకు ఉపక్రమించే సమయంలో హిందువులు నిర్వహించుకునే తొలి ఏకాదశి పండుగ సందర్భంగా దేవస్థానానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించకపోవడం దారుణం అన్నారు. ఏడాది నుండి స్వామివారి ప్రాకారోత్సవం ఎందుకు నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా దేవదాయ శాఖ జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి స్వామివారికి నిత్య కైంకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా, ప్రసాద్‌రెడ్డి, దొంతు సుమన్, మహేష్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతీక మొహర్రం : చమర్తి

**వీరబల్లి,జులై 17,ప్రభాత వార్త :**



రాజంపేట నియోజక పరిధిలోని వీరబల్లి మండలంలోని ఈడిగపల్లె వీరబల్లి గ్రామాల్లో జరిగిన మొహర్రం వేడుకలను ఆయా గ్రామాల టిడిపి కార్యకర్తలు, గ్రామస్థులు ఆహ్వానం మేరకు బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు హాజరై ఈడిగపల్లె, వీరబల్లి లలో జరుపుకుంటున్న పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈడిగపల్లె లోని టిడిపి బిసి నాయకుడు జనమేజేయుడు ఇచ్చిన విందుకు హాజరై విందును శ్వీకరించారు. జగన్‌మోహన్ రాజు రాక సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోళ్ల సురేంద్ర, టిడిపి నాయకులు రెడ్డెప్ప రెడ్డి, తదితరులు ఉన్నారు.

## వేంకన్నకు విశేష అలంకరణ

**పులివెందుల టౌన్, జూలై 17, ప్రభాతవార్త :**
పులివెందులలో వెలసిన పద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం సాయంత్రం ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేశారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో కూర్చోబెట్టి భక్తులు పల్లకిని భుజాలపై మోస్తూ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవిందా.. గోవిందా.. నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



## హజరత్ ఇమామే హుసేన్ త్యాగానికి ప్రతీక మొహరం

**జమ్మలమడుగు, జులై 17, ప్రభాతవార్త:**



ప్రపంచంలో ఇస్లాం మతం విశ్వ వ్యాప్తంగా కాపాడేందుకు ప్రవక్త మహ్మద్ ప్రవక్త మనువడు మరియు హజరత్ అలీ (ర.జ) కుమారులు హజరత్ ఇమామ్ హుసేన్ రణరంగంలో (కర్బలా మైదానం)లో కాఫెర్‌లతో పోరాడి ప్రపంచ మానవాళి రక్షణ కోసం పోరాడి ప్రాణ త్యాగం చేశారని హజరత్ ఇమామే హుసేని త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ పాషాఖాద్రి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని జామియా మసీదులో మొహరం పండగ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వమించి జామియా మసీదుకు వచ్చిన భక్తులకు మొహరం పడగ సందర్భంగా ఉపవాసం ఉన్న భక్తులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి కుటుంబ సభ్యులు, గురువులు, ముస్లిం సోదర సోదరీమణులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

**కడప కార్పొరేషన్, జులై 17, ప్రభాతవార్త:**
కడప జిల్లా నూతన ఎస్పీ వి.విష్ణువర్ధన్‌రాజును మాజీ డిప్యూటీ మేయర్ బి.ఆరీఫుల్లా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేను ఇచ్చి శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆరీఫుల్లా మాట్లాడుతూ జిల్లా ఎస్పీని కలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టరుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**కడప వైద్యవిభాగం, జులై 17, ప్రభాతవార్త:**
కడప నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరు శివశంకర్ లోతేటిని ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకులు అనకర్ల వసంతరావుతో పాటు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అందెల సురేష్ కుమార్ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. 15 సంవత్సరాల ముందు జిల్లా కలెక్టరుతో యూపీఎస్సీ పరీక్ష కోసం కలిసి చదువుకున్నామని ఎంతో ఆప్యాయతగా కలెక్టరు పలకరించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఇప్పుడు మన జిల్లా కలెక్టరుగా రావడం చాలా సంతోషంగా ఉందని మన జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు.

## తొలి ఏకాదశి సంధర్భంగా పెద్దమ్మ గుడిలో అన్న ప్రసాదం

**ప్రొద్దుటూరు, జులై 17, ప్రభాతవార్త:**



హిందువులకు ఎంతో పవిత్రమైన తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని పెద్దమ్మ గుడి ఆవరణలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రసాదం గావించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ హిందువులకు మొదటి పండుగగా ఉందన్నారు. ఈ పర్వదిన సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరూ పొంది సుఖ సంతోషాలతో జీవనం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ చైర్మెన్‌గా తాను అన్నప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో ప్రజలు పాల్గొని పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ మాదిగ కుటుంబ సభ్యులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తిరాల త్రేతేశ్వర స్వామిని దర్శించుకున్న జగన్ రాజు

**రాజంపేట అర్బన్, జులై 17, ప్రభాతవార్త:**



జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం అత్తిరాల ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. రాజంపేట మండలం హత్యరాల గ్రామంలో బుధవారం పర్యటించారు. తొలి ఏకాదశి సంధర్భంగా శ్రీ కామాక్షి త్రేతేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందించారు. ఆలయ విశిష్ఠత వారికి వివరిస్తూ అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన చమర్తి జగన్‌మోహన్ రాజుకు ఆలయ మాజీ చైర్మెన్ పూల నరసింహులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. హత్యరాల దేవస్థానం ఆలయ మాజీ చైర్మెన్ పూల నర్సింహులు ఆధ్వర్యంలో చమర్తి జగన్‌మోహన్ రాజు గానిరి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్ శంకర్‌రాజు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రమణ్యం నాయుడు, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ కుమార్ రాజు, సీనియర్‌నాయకులు జీవి సుబ్బరాజు, శేశారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగుయువత పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, ఆలయ మాజీ డైరెక్టర్‌లు కడప రాంప్రసాద్, తాళ్లపాక సుబ్బరాయుడు, యువ నాయకులు పూల బాలాజి, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాకలో వైభవంగా ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

**రాజంపేట అర్బన్, జులై 17, ప్రభాతవార్త:**
పదకవితా పితామహులు తాళ్లపాక అన్నమయతమ్య స్వయంగా అర్పించి, సేవించిన శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వర స్వామి వార్ల వార్శిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ఘణంగా ప్రారంభమయ్యాయి. ఈ సంధర్బంగా సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి వారి దేవాలయాల్లో వేరువేరుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం సిద్ధేశ్వర స్వామి హంస వాహనంపై, చెన్నకేశవ స్వామి శేష వాహపంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఈ సంధర్భంగా ఆర్ శ్యామ్ కుమార్ బృందం ఊంజల్ సంగీతం, లీలావతి, లక్ష్మిదేవి గంగావతి బృందాలు తమ కోలాటాలతో భక్తులను అలరించారు. సంగీతం ఈ కార్యక్రమంలో తాళ్లపాక సమూహ దేవాలయాల పర్యవేక్షణాధికారి వై.హనుమంతయ్య, ఇన్స్‌పెక్టర్ బాలాజి, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ఆర్. స్వామి నాయక్, ధర్మాచార్యులు, గంగనపల్లి వెంకటరమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాజంపేటలో వైభవంగా మొహరం వేడుకలు

**రాజంపేట అర్బన్, జులై 17, ప్రభాతవార్త:**



మత సామరస్యానికి ప్రతీక అయిన మొహరం వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో రాజంపేటలో ఘనంగా జరిగాయి. రాజంపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాలైన మిట్టమీదపల్లి, ఎల్లాగడ్డ, మండపల్లె ప్రాంతాలలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజంపేటలో నాగులమాను వద్ద నుంచి పూజలు అనంతరం పీర్లను ఊరేగించారు. పీర్ల ఊరేగింపులో యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## హిందూ ముస్లింల ఐక్యతతో మొహరం



**గాలివీడు, జులై 17(ప్రభాతవార్త):**
హిందూ ముస్లింలు మొహరం పండుగను సమైక్యంగా జరుపుకుంటారని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోరెడ్డిగారిపల్లెలో మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ ఆలీమాబాను కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పీర్లకు గొడుగులు, పూల భాషికాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం పండుగను హిందూ ముస్లింలు కలిసిమెలసి జరుపుకోవడంతో ప్రజల్లో సమైక్యత సంఘీభావం ఏర్పడుతుందన్నారు. అనంతరం ముస్లిం మత గురువులు పీర్లపండుగ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్నాథరెడ్డి, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, టోపీవలిసాబ్, వీరాంజనేయులు, శివశంకర్, రమేష్, మహమ్మద్, బాబ్జీ పాల్గొన్నారు.

## మాండవ్య నదిని శుభ్రపరచి ప్రజల ప్రాణాలు కాపాడండి



**రాయచోటి, జులై 17, ప్రభాతవార్త:**
మురికి నీటి కుంటగా మారిన మాండవ్య నదిని శుభ్రపరిచి డెంగీ, మలేరియా నుంచి రాయచోటి ప్రజలను కాపాడాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక భారత న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మురికి నీటితో నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన మాండవ్య నదిని ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు సందర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ మాండవ్య నది పరిశుభ్రతపైన మురికి నీటి కాలువలపైన గత ప్రభుత్వం దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం చేయడం వలన రాయచటి పట్టణంలోని మొత్తం మురికి నీరంతా మాండవ్య నదిలోకి వదిలివేయడంవలన అది ఇలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా దీనిపై శ్రద్ధ వహించి మాండవ్యనదిని శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, ఆనంద్‌కుమార్, చిన్నయ్య, రవిశంకర్, వడ్డెర విద్యా వంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మారుతీ శంకర్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు, శ్రీనివాసులు, విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షులు చెల్లా రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన అనంతరం ఉద్యోగం సాధించలేకపోతే మొత్తం ఫీజు వాపసు

**కడప ఎడ్యుకేషన్, జూలై 17 ప్రభాతవార్తః**



ఇంజనీరింగ్ కళాశాలలో తలమానికంగా నిలిచే కడప కేఎస్ఆర్ఎం కళాశాల మేనేజ్‌మెంటు ఈసంవత్సరం(2024'-25) తమ కళాశాల యందు చేరే విద్యార్థులు తమ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించి పూర్తైన అనంతరం ఉద్యోగం సాధించ లేకపోతే ఆవిద్యార్థులు తాము నాలుగు సంవత్సరాలు చెల్లించిన పూర్తి ఫీజు మొత్తాన్ని తిరిగి వెనక్కు ఇవ్వబడుతుంది, ఇందులో ఎటువంటి సందేహం లేదు, తాము నాలుగు సంవత్సరాలు ఉద్యగం పొందేందుకు ఇచ్చే ప్రత్యేక తర్ఫీదు, మెలుకువలు, శిక్షణ మొదలగునవి విద్యార్థులు ఉద్యోగం పొందేందుకు ఉపయోగపడుతాయి. దీన్ని దష్టిలో ఉంచుకుని తాము ఇంత ఖచ్చితంగా ఉద్యోగ సంపాదనలో ఇంత నమ్మకంగా చెప్పగలుగుతున్నట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దష్టిలో ఉంచుకుని ఏకళాశాల ఇవ్వని ఇలాంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బిటి కళాశాల అధ్యాపకుల సమస్య పరిష్కారించాం - ఎమ్మెల్యే

**మదనపల్లెక్రైం, జులై 17 ప్రభాతవార్త :**



మదనపల్లె బిటి కళాశాల అధ్యాపకుల సమస్యను మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కరించామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో బిటి కళాశాల ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిటి కళాశాలకు మళ్ళీ పూర్వవైభవాన్ని తెస్తామని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వేతనాలు విడుదల చేయించడం జరిగిందని ఎమ్మెల్యేపేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఇవ్వకుండా అధ్యాపకులు, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. బిటి కళాశాలలోని సిబ్బంది, అధ్యాపకులు జీతాలు అందని విషయాన్ని మంత్రి నారాలోకేష్ విన్నవించడం, తరువాత వారే స్వయంగా మంత్రి లోకేష్‌ను కలవడం జరిగిందన్నారు. స్పందించిన మంత్రి పెండింగ్ జీతాలు విడుదల చేసి బిటికళాశాలను యూనివర్సిటి చేస్తామని, పూర్వవైభవాన్ని తీసుకువస్తామని తెలిపారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్టు

**ప్రొద్దుటూరు క్రైం, జులై 17, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో గల ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల రోడ్డులోని పాలకేంద్రం వెనక గల రిజర్వు ఫారెస్టులో అమృతనగర్‌కు చెందిన షేక్ అన్వర్ బాషా తన భార్య రేష్మాను హత్య చేసిన కేసులో ఆమె అన్న ముకుందర్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 16న అన్వర్ బాషా పంచాయతీ కార్యదర్శి వద్ద హాజరయ్యాడు. తన భార్య రేష్మాపై అనుమానంతో తన భార్యకు విడాకులు ఇచ్చి 2వ పెళ్లి చేసుకోవాలని తన భార్యను విడాకులు ఇవ్వాలని కోరారు. అందుకు ఆమె ససే మిరా అనడంతో ఈనెల 12న పార్కుకు పోదామని నమ్మబలికి పాలకేంద్రం వెనక గల ఇసుక దిన్నెలలోకి పిలుచుకొపి గొంతు నులిమి చున్నీతో గొంతు గట్టిగా బిగించి హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి అరెస్టు చేసి అతని వద్ద నుంచి మోటారు బైకు, 2 సెల్‌ఫోన్లు, హత్య చేయడానికి ఉపయోగించిన చున్నీని స్వాధీనం చేసుకున్నారు.

